


# నవ్వే

కొడవంటి కాశీపతిరావు

మంజుల నవ్వింది.

మృదు మధురంగా, మనోజ్ఞంగా, మంజులంగా నవ్వింది. అంతకన్న ఆ నవ్వు అందం చెప్పలేం. ఎక్కడ ఎప్పుడు ఎలా నవ్విందోయ్ మంజులా? అని అడగవచ్చు.

కాలేజీలో ప్రవేశిస్తూ నవ్వింది.

సుమారు పదిన్నర గంటల వేళ నవ్వింది.

ఎలాగంటే చెప్పాం...... అలా నవ్వింది.

అయితే మన పెద్దలు కొన్ని సిద్ధాంతాలూ, జనరలైజేషన్‌లూ చేసేసారు. వారు చెప్పనే చెప్పారు... లక్ష్మణుడి నవ్వులా, ...నవ్వు నాలుగు విధాల చేటులా....అలానే మంజుల నవ్వేసింది. పెద్దలనెంత ఎదిరిద్దామనుకున్నా ఇలాంటి విషయాల్లోనే కష్టమవుతుంది.

కాకపోతే సుమారు ఆ పదిన్నర గంటల వేళ రాంబాబు సైకిలు మీద ఎదురు రావడ మేమిటి? బెల్లు కాలేదని అందర్నీ రిసీవ్ చేసుకుందుకు అటూ యిటూ తిరుగుతున్నాడు పాపం. ఎంత లేదన్నా ఫైనలియర్ స్టూడెంటు. అందగాడు. తనని చూసే నవ్విందని మురిసిపోడూ మరి? హేండిల్‌బార్ మీద ఒక చేతితో జేబులోని రుమాలుతో ముఖం మీది పాత ఫీలింగ్స్ చెరిపేసుకుని సరికొత్త ఫీలింగ్ పులుముకున్నాడు.

ఆ సైకిలుకే ఎదురౌతూ ఆ సుమారు పదిన్నర గంటల వేళ సుబ్రమణ్యం రావడ మేమిటి? పాపం మరి రాడూ? కాలేజీ వేళాయె.... అందులోనూ బుద్ధిమంతుడు క్షేమకి రాడూ మరి. వస్తాడు. అయితే రాంబాబు తాలూకా ఒంటి చేత్తో నడపబడుతున్న సైకిలు ఇతనెదురౌతే అదరదూ మరి. అదురుతుంది. అందులోనూ మంజుల నవ్విందని ఆ ఒంటి చేయి కూడా అదిరే వుంటుంది. పాపం సైకిలు అదరడం కాదు గాని మన సుబ్రమణ్యం బెదిరి పోయాడు. అవునయ్యా మరి.... ఆ సైకిలు అటూ ఇటూ తిప్పేస్తుంటే ఎటు వెళ్ళాలో ఎలా తెలుస్తుంది. పోనీ బెదిరాడనుకో ఆ బెదిరినప్పుడే తన బెదురు ఎవరైనా చూసారేమోనని అటూ ఇటూ చూడ్డం దేనికి? చూడడూ మరి.... స్టూడెంటు! ఇసుమంత చెడు జరిగినా ఏదో పెద్ద అవమానం కింద లెక్క కట్టే బాపతు. మంజుల నవ్వడం చూసాడు. చూస్తాడు. ఆనాడు ద్రౌపది మయసభలో నవ్వినందుకు దుర్యోధనుని కెంత కోపం వచ్చింది? అయితే సుబ్రమణ్యాన్ని దుర్యోధనునితో పోల్చం. పాపం చాలా బుద్ధిమంతుడు. అంత కోపం వచ్చిందన్న మాట. గడ్డి పోచలా కన్పించానా తను.... ఏదో బెదిరాడు.. ఆలోచిస్తూ చూడలేదు... అయినా దానికి కాదులే నవ్వు... తానేదో పెద్ద... మిస్ కాలేజీనని... గర్వం.... ఎప్పుడూ గిరగా ఉంటాయి చూపులు... అయినా ఆడదానికి అంత అహంకారం పనికి రాదు... తోటి వాళ్ళు మనుషులే గాని గడ్డి పోచలుకారు.

ఆ పదిన్నర గంటల వేళ ఇంకా బెల్లు కాలేదని సదరు కాలేజీలోనే తన డిపార్టుమెంటు బయటి వరండాలో తచ్చాడుతున్నాడు ఆనందరావు. ఆనందరావు ఎవరో అనుకునేరు. ఆ కాలేజీలోనే పని చేస్తున్న లెక్చరరు. ఇంకా చెప్పాలంటే ఈ సోకాల్డ్ మంజుల తండ్రికి మంచి దోస్తు. అయితే కావచ్చు. పాపం పిల్ల నవ్వింది కదా.... ఎందుకు నవ్వింది? ఎలా నవ్వింది? ఎవరిని చూసి నవ్వింది? అని పరిశీలించాలా? పరిశీలించడూ మరి... ఎంత లేదన్నా వాడూ తనూ కావలసిన వాళ్ళు. మంజుల నవ్వడమూ, రాంబాబు కర్చీఫ్‌తో ముఖాన్ని తుడిచి మేఘాల చాటునున్న చంద్రుడిని బయటికి తెచ్చి చూపించినట్లు ముఖం చూపడం... ఆ పరవశంలో చెయ్యి వణకడం.. అన్నీ చూసాడు ఆనందరావు. అన్న దొంగ పిల్ల... ఈ రాంబాబుగాడసలే కొంటెవాడే— వాడితో నేమిటి? ఇలా కాదీ అమ్మాయికి, వీళ్ళ నాన్నతో చెప్పి చదువు మాన్పించి,

ఫెళ్ళి చేయించేయాలి.ఆ అందులోనూ తనకు తెలిసిన బుద్ధిమంతు డొకడున్నాడు...

ఆ పదిన్నర గంటల వేళే..."చిరునవ్వు నవ్వుతావు కాని హలో అని పలకరించవు కదా! పలకరిస్తే ముత్యాలు రాలిపోతాయి కాబోలు." ఎదురైన సుమలత పలకరిస్తూనే అలక చూపింది. ఆ అలకకు సమాధానంగా మరో చిరునవ్వు విసరి క్లాసుకు తీసుకు వెళ్ళింది మంజుల.

క్లాసులో కూర్చుందన్నమాటే గాని మంజులకు పాఠం మీద ధ్యాస లేనేలేదు. ఎలా వుంటుంది? ఉండదు. బోడిపాఠం.... ఇకనామిక్స్ ఈజ్ ఇకనామిక్స్.... ఇది లెక్చరరు గారు చెప్పేది. ఇకనామిక్స్ ఇకనామిక్స్ కాకపోతే ఇంకేమవుతుంది? అబ్బబ్బ... ఏదో ఉద్దేశ్యంతో ఏదో చెప్పబోతారు వీళ్ళు......

అవునూ..చిరునవ్వు నవ్వితే.. తేరిపార చూడనైనా చూడడేం అతను? హు ... గొప్ప సిగ్గు పాపం... ఆడపిల్లలంటే మరీ సిగ్గు.... స్త్రీని చూసి సిగ్గు పడే మగవాడంటే స్త్రీకి మక్కువ లని సోమర్ సెట్‌మామ్ అననే అన్నాడు... అలాగా నాకు కూడా అతనంటే అంత ఇష్టమా? అమాయకంగా చూస్తాడు.. తల దించుకుంటాడు ఎదురైతే... ఎప్పుడు నవ్వి మామూలతో పలకరిద్దామన్నా వీలు కల్గించడు... ఇవాళ చూసాడు.. కాని ఏదోలా కొరకొరా చూసాడు.. నామీద ఏమైనా కోపమా?.. అబ్బే నామీద కోప మేమిటి? తననీ ప్రేమ జంజాటంలో కీడ్వవద్దని కాబోలు... ఆ చూపుల కర్థం... పిచ్చివాడు... గొప్పసిగ్గు... ఆడ పిల్లల కుండవలసిన సిగ్గు పోయింది ఈ కాలం... మగ పిల్లలు సిగ్గు పడుతున్నారు... అయితే అందరి విషయంలోనూ కాదు. ఒక్క సుబ్రమణ్యం విషయంలోనే తనింత వరకూ చూసింది. లేబరేటరీలో ఫైనలియర్ వాళ్ళు కలిసినపుడు ఎప్పుడు తన పక్క చూసినా పలకరించ బోతుంది. వెంటనే తల దించుకుంటాడు తను.... లేబొరేటరీలో ఉన్న మూడు గంటల లోనూ కళ్ళతో ఎన్నో మాటాడుతుంది తను... అబ్బే ఒక్కటీ అర్థమై చావదు కదూ.. ఇంత తెలివైనవాడూ... కళ్ళలోని మాటలు అర్థం చేసుకోడేం? ఖర్మ!

"ఇకనామిక్స్ డెఫినిషన్ ఏమిటో సరిగా బోధపడలేదు. కొంచెం చెప్పవోయ్" వెయిటింగ్‌రూంలో అడిగింది సుమలత.

"నేనూవినలేదోయ్" మర్యాదగా చెప్పింది మంజుల.

"మరికొయ్యకోయ్...ఇంత క్లవర్ హెడ్డూ నేను వినలేదూ, నాకు రాదూ అంటే ఎవరు నమ్ముతారు?"

"అబ్బబ్బ నేను వినలేదంటే నీక్కాదూ ఏదో చికాకుల గురించి ఆలోచిస్తోంటే"

"అవును తెలుసులే అమ్మా...చెప్తేనాకెక్కడ వచ్చేస్తుందో. ఇవాళరాత్రి ఎంత వరకూ చదవడమో..... ఏవిటేవిటీచదవడమో ఆలోచిస్తుంటావ్. ఏవేవి ఎంత వరకూ చదివేవని మర్నాడడిగితే అబ్బే ఏడు గంటలకే పడుకున్నానంటావ్....చెప్తే తప్పేనట్టూ....ఆలోచించటానికి ఇంతకన్నా, చికాకులేమున్నాయ్ నీకూ.... డబ్బున్నవారి అమ్మాయివి."

సాగిపోతోంది ధోరణి. వినడం ఎప్పుడో మానేసింది మంజుల. సాధారణంగా మనకు కావలసిన మాటలే విన్పిస్తుంటాయ్.

వాళ్ళనాన్నతో చెపుదాం అనుకుంటూనే పాపం తీరుబాటు లేక కలవడం పడలేదు ఆనందరావుకి.....ఈ సందర్భంలో పెద్దలు మరో జనరలైజేషన్ వదిలేస్తారు. ఆలస్యం అమృతం విషం.

ఆనందరావుకి తీరుబాటు లేని ఈ చాలా కాలంలో ఎన్నో జరిగాయి మంజులకు హాయిగా......

సుబ్రమణ్యం ఎదురైనప్పుడు రెండు మూడు సార్లు చిరునవ్వు నవ్వింది, మంజుల ఎవ్వరూ చూడకుండా. మొదట్లో గాభరా పడ్డాడు. రెండోసారి జరిగిన అవమానాన్ని గుర్తు చేస్తోంది కాబోలనుకున్నాడు. మూడోసారి నాలుగోసారి అయోమయావస్థలో పడ్డారు. రానురాను అర్థం చేసుకోవటంతో ఆమెమీద దురభిప్రాయం పోయినట్టనిపించింది. నీటుగా గోటుగా ట్రిమ్‌గా చిరునవ్వు నవ్వడం ప్రారంభించాడు. ఎవరూ? సుబ్రమణ్యం! సుబ్రమణ్యమేనా అనిపించింది మంజులకు. అన్నా సీజనే మారిపోయిందే అనుకుంది. సంతోషించింది. కళ్ళతో ఇప్పుడు ఫ్రీగా మాట్లాడు కుంటున్నారు. నోటిమాటల కింకా ధైర్యం రాలేదుగా మరి.

"సుమా! ఇవాళ ఫస్ట్ షోకు మినర్వాకు వెళ్దామే" అర్థం చేసుకుని మినర్వాలో వాలేవాడు సుబ్రమణ్యం. "ఒరేయ్ ఇవాళ పౌర్ణమిరోయ్ బీచికి వెళ్దాం. కెరటాలు ఎంత ఎత్తుగా వస్తాయో...." అంటూంటే అబ్బా ఇతనికి ప్రకృతి అంటే ఎంత ఇష్టం అని చెప్పేసేసి సుమతో వెళ్ళేది మంజుల.

రంగు, రుచి, వాసన చూసి దాని సంగతే విటో పసిగట్టేవాళ్ళల్లో సుమ ఒకర్తె. ఒకరోజున ఉన్న మాటను కక్కేసింది సుమలత.

"ఏవోయ్..సుబ్రమణ్యం అంటే యిష్టంలాగుంది.." సాధారణంగా నిజాలైనా ఒప్పుకోరు ఆడాళ్ళు. అమ్మో అందరికీ తెలిస్తే ఎలా? అందులోనూ సుమలతలాంటి సిసింద్రీకి తెలిసిందంటే ఇంకేమైనా వుందీ?

"ఛచ్ఛ సుబ్రమణ్యమా! ఆడపిల్లని చూస్తేనే తలకాయవంచుకునేంతసిగ్గు అయితే ఆడదేం ఇష్టపడుతుందోయ్"అలాంటివాళ్ళంటే ఆడాళ్ళు ఇష్టపడతారన్న సంగతి మంజులకు బాగా తెలుసు.

పాపం మోసపోయిందో, నమ్మినట్టుగా అలా నటించిందో గాని మరో ప్రశ్న వేసింది సుమలత.

"పోనీ రాంబాబంటె ఇష్టమా?"

"రాంబాబా?"

సినిమాల్లో ఒక్కొసారి కొట్టిపారేస్తారే ఇలాంటి సమయంలో ఆవెయిటింగ్ రూం ప్రక్కనుంచి వస్తారా? మన్ని సినిమాల్లోలాగా, అద్దంమీదనీడ, చెవి ఒగ్గి వినడం......మిగతా వన్నీ అవాస్తవికం అనుకోండి..

కాని ఇక్కడ ఆనందరావా వెయిటింగ్ రూమ్ ప్రక్కనుండి అదే సమయానికి రావడం మాత్రం జరిగింది.. ఇందాకనే చెప్పుకున్నాం. కావలసిన మాటలు ఎంత దూరానున్నా విన్పిస్తాయి. రాంబాబన్న మాట లేడీస్ వెయిటింగ్ రూమ్‌లోంచి రావడమేమిటా అని ఆశ్చర్యపడి.. అన్న వారెవరా అన్న ఉత్సుకతతో లోపలికి చూసాడు ఆనందరావు. సాక్షాత్తూ మంజుల.

అన్నా! శ్రుతిమించిరాగానపడుతోందే. అని చెప్పేసేసి ఆవేళసాయంత్రమే వాళ్ళ నాన్నని కలుసుకోవాలను కున్నారు. సాయంత్రానికి తాను మరచి పోనవచ్చు.. అదీగాక మంజుల

ఇంటిదగ్గరే ఉంటుంది.. అని ఆలోచించి వెంటనే కాజుయల్ లీవు పెట్టి కాలేజి దాటిపోయాడు ఆనందరావు.

"మంచిపనయింది మంజులకి. ఆనంద రావులాంటి పెద్దలుండబట్టి ఈలోకం ఇలా నడుస్తుందిగానీ" ఇంతవరకూ చది విన పెద్దలు అనుకుంటారలా. "యువతీ యువకులపాలిట ఈ పెద్దలే బ్రహ్మరాక్ష సులుసుమా.. లేక పోతే మధ్యలో ఈవిల నేవిటి?" అనుకుంటారు యూత్.

లోకంలో ఎవరూ మంచివాళ్ళుకారు, ఎవరూ చెడ్డవాళ్ళుకారు. ఒక్కొక్కరి ఆలోచనలను బట్టి వాడు మంచి వీడు చెడు నిర్ణయించుకుంటారు. దొంగ మనకు దొంగ. మన ఆలోచనలకు దొంగ వాడితరపున ఆలోచిస్తే...కడుపు జరక్క, పని దొరక్క దొంగతనం తప్పేంలేదే అంటారు. నిజమే మరి. అలాగే హంతకుడు మన ఆలోచనలకు హంతకుడు. వాడితరఫున ఆలోచిస్తే.....ఏదో బలవత్తరమైన కార ణం ఉండబట్టి హత్య చేసాడు. నువ్వే ఆస్థి లో వుంటే ఉద్రేకం ఆపుకోలేక నువ్వూ చేస్తావు. అంటారు. అదీనిజమే.

అయితే ఇక్కడ జరగవలసింది మాత్రం జరిగింది. "ఏరా! కూతుర్ని అలానే పెంచు కుంటావట్రా........" అంటూనే గుమ్మం ఎక్కాడు ఆనందరావు.

## నవ్వు

"ఒహో! ఎంతకాలానికిరా! వూళ్ళో ఉండి రావటం లేదేవిట్రా...... ఒసేయ్ కాఫీ పట్రా.....కూర్చోరా....."

ఈగాభరాతో ఆనందరావు గాభరా కొంత తగ్గింది. తాపీగా చెప్పారు. "మంజులపనేం బాగా లేదురా. కాలేజి చదువుమాన్పించి సుబ్బరంగా రేపు ఆషాఢ మాసం దాటంగానే మూడుముళ్ళు వేయించేయ్. నీకూ వయసు దాటుతోంది. అందులోనూ ఒక్కర్తే ముద్దుబిడ్డ.. ఆలోచించేచెప్తున్నా... ఊఁ... ఏవంటావ్"

పెద్దలమాటలు భలే తమాషాగా ఉంటాయి. వింటున్నకొద్దీ వినాలని పిస్తుంది. ఈమూడు ముక్కల్లో చెప్పిందేవీ లేక పోయినా ఆపెద్దాయినకి కూడా అంతా అర్థమైపోతుంది. ఆకాలేజీలోనే పని చేస్తున్నాడు. తన క్షేమంకోరేవాడు. మంజుల గురించి ఉత్తినే చెడుగా చెప్తారా?

అదేకుర్రాళ్ళయితే ఆయునతో ఎలా చెప్తారూ? "ఏవండోయ్! మీ మంజుల సంగతేం బాగా లేదు. రాంబాబుకి సైట్లు కొడ్తోంది. పావురాలు కూడా నడుస్తున్న ట్టున్నాయి."

ఇంతా ఆలోచించి "సర్లేరా! ఆనంద రావ్. నీకుమాత్రం తెలియదా? నీ ఎరికనే వైనా మంచి సంమ్మంధాలుంటే చెప్పు. తప్పకుండా చూద్దాం. ఈపెళ్ళికార్యం కూడా నువ్వే బాధ్యత వహించాలిరా.." అంతపెద్ద పని అప్పగించి అమాంతం పెద్దమనిషిని చేసేసి తైరుకొడ్తే ఎవరైనా చేసేస్తారు. వెంటనే మహా ఇదయి పోయి తన ఎరికనున్న ఒక సంమ్మంధం, ఆ ఒక సమ్మంధం తాలూకు పుట్టు పూర్వోత్త రాలు ఏకరువు పెట్టేసి అగ్గిరాజేసి వెళ్ళిపోయారు ఆనందరావు.

అగ్గి భగ్గుమంది మంజులరాగానే.

"అమ్మాయ్...నీ సంగతేం బాగాలేదని ఆనందరావు చెప్పారు."

"అవునునాన్నా. ఇవ్వాళంతా నాకు తల నొప్పిగా వుంది"

"హాస్యం కాదమ్మాయ్... కాలేజీలో నీప్రవర్తన ఏం బాగా లేదటగా...ఇంకెన్నాళ్ళలే......నీకు పెళ్ళి నిశ్చయించేసాం."

సినిమాల్లోలాగా పిడుగు పడలేదు. తాపీగా అడిగింది.

"ఎవరు నిశ్చయించారు నాన్నా?"

"ఆనందరావూ, నేనూ"

కాలేజీలో తన సంగతంతా ఆనంద రావు గమనించి ఉంటారు. అయితే సుబ్ర మణ్యం అంటే ఆనందరావుకి చాలా యిష్టంలే. అందుకోసమే కాబోలు నాన్న చేత చీవాట్లు పెట్టించబోయారు. అయినా ఆనందరావు నిశ్చయించాడంటే ఏదో అనుమానం వేసింది మంజులకు

"ఎవరికివ్వాలని నిశ్చయించారు?"

ఎక్కడ ఏడ్చేసి మారాం చేసి గందరగోళం చేసేస్తుందో కూతురు అని భయపడ్డ ఆయన విస్తు పోయారు. అయినా అన్నీ విని నాకొద్దు ఈ సంబంధం అని కుండ బ్రద్దలేసిందంటే బ్రహ్మదేవుడుకూడా చేయ లేడీ పెళ్ళి. తనంత అశక్తుడు కూతురి దగ్గర.

బెరుకుతోనే చెప్పారు.

"సుబ్రమణ్యం అని మీకాలేజీలోనేచదువు తున్నాడటగా ..అతని గురించి ఆనందరావు చాలా..........."

ఇంకేం వినలేదు మంజుల, మహాసిగ్గు పడిపోయింది. కుంచించుకు పోయింది, నలిగి పోయింది. పారి పోయింది.

ఈ ఏక్షన్లన్నీ చూపి పెళ్ళంటే ఆడ పిల్లల కెంత సిగ్గు అని అమాయ కంగా అనుకున్నాడాయన. ●

# రాగగీతి

నింగిని మేఘములల్లెను హేలగ
నెమళ్ళు పురులను విప్పెను లీలగ
చంద్రుడు కరములు చాపెను తిన్నగ
కలువలు కన్నులు విచ్చెను మిన్నగ
వెన్నెలభూమిని నింపెను సొంపుగ
కోమలిరాగము తీసెను ఇంపుగ
చేతులు వీణను మీటెను మృదువుగ
సప్త సర్వములు చిలికెను మధువుగ
మద్దెల మ్రోతలు మ్రోగెను మెల్లగ
కాలిని గజ్జెలు కదలెను పెల్లుగ
మదిలో తలపులు కలిగెను కొల్లగ
గొంతుక వాటిని పాడెను చల్లగ.

'జయప్రియ'